## క్లుప్తంగా

### వివాహ వేడుకలకు హాజరైన దద్దాల



వివాహ వేడుకల్లో దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: సైకం రమణారెడ్డి ఉషారాణిల కుమార్తె వివాహ వేడుకల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. నూతన వధువును ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలురెడ్డి, మీసాల నారాయణ, సైకం శివారెడ్డి, పాణ్యం మురళీ, సైకం తిరుపతిరెడ్డి, శ్యామల మాల్యాద్రి, మడతల సూర్యనారాయణరెడ్డి, గిద్దా గురుస్వామి యాదవ్, వాకుమళ్ల రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: గోడి వారి వివాహ వేడుకల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. మున్సిపాలిటీలోని ఆరవ సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ గోడి నవీన్‌రెడ్డి, లతల వివాహ వేడుక శనివారం రాత్రి స్థానిక తాళ్లూరి కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వివాహ వేడుకల్లో దద్దాల పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, టి. కృష్ణారెడ్డి, వాకుమళ్ల రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

### 1117 బేళ్లు కొనుగోలు

కొండపి(సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 1117 బేళ్లను వ్యాపారులు కొనుగోలుచేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. అనకర్లపూడి, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పరాజుపాలెం, చతుకుపాడు, కె.అగ్రహారం, మూగచింతల, గుర్రప్పడియ, నెన్నూరుపాడు, నేతివారిపాలెం, రామచంద్రాపురం, కట్టావారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 1332 బేళ్లను వేలానికి తీసుకురాగా 215 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.100, సరాసరి రూ.184.30 పలికింది. వేలంలో 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఎస్సైగా ప్రేమ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



ఎస్సై ప్రేమ్కుమార్

కొండపి (సింగరాయకొండ): ఎస్సైగా ప్రేమ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై కృష్ణ బాజీబాబు వీఆర్‌కు వెళ్లగా, వీఆర్‌లో ఉన్న ప్రేమ్‌కుమార్ కొండపి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేరుగా కలవచ్చని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు.

**పీఆర్ డీఈఈగా శ్రీధర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ**



డీఈఈ శ్రీధర్‌రెడ్డి

కనిగిరి రూరల్: కనిగిరి పంచాయతిరాజ్ డీఈఈగా సి.శ్రీధర్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన సింగరాయకొండ నుంచి బదిలీపై కనిగిరికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ డీఈఈగా పనిచేసిన ఆది శేషు దరిశి డీఈఈగా బదిలీపై వెళ్లారు. నూతన డీఈఈను ఏఈలు, అధికారులు కలిసి స్వాగత శుభాకాంక్షలు తెలిపారు.

### రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



జరుగుమల్లి స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

జరుగుమల్లి(సింగరాయకొండ): అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ జనార్దన్ తెలిపారు. జరుగుమల్లి పాలేరు నుంచి ఇసుక ట్రాక్టర్లతో టంగుటూరు వైపు తరలిస్తుండగా తహసీల్దార్ తనిఖీలు చేసి పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

### నారాయణస్వామి ఆలయంలో ఆర్డీఓ పూజలు



మిట్టపాలెంలో ఆర్డీఓ దంపతులకు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో శనివారం విశిష్ట పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కనిగిరి ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి దంపతులు అర్చనలో పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కొమ్మినేని వెంకట్రావు స్వామి శేషవస్త్రంతో వారిని సన్మానించారు.

# ఇక పల్లెల్లో కిక్కే.. కిక్కు..

- నియోజకవర్గంలో పెరిగిన మద్యం షాపులు
- మండల పరిధిలో ఎక్కడైనా దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు
- గ్రామాల్లో రెట్టింపు కానున్న మందుబాబుల వీరంగాలు





కనిగిరి ఎక్సైజ్ శాఖ కార్యాలయం

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో మద్యం ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తే కూటమి ప్రభుత్వం మాత్రం మద్యాన్ని ఏరులై పారించేందుకు రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న దుకాణాలను పెంచేసింది. ఎక్కడ కావాలంటే అక్కడ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించింది. పర్మిట్ రూంలకు మంగళం పాడేసింది. దీంతో గ్రామాల్లో ఇక మద్యం కిక్కు ఏ రేంజ్‌లో పెరుగుతుంది, మందుబాబుల చిందులు, ఆగడాలు ఏస్థాయిలో పెరుగుతాయో అర్థం చేసుకోవచ్చు.

**పెరిగిన దుకాణాలు..**

ప్రస్తుతం కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 17 మద్యం షాపులుండేవి. వాటి సంఖ్య ఇప్పుడు 19కి పెరిగింది. కొత్త మద్యం పాలసీలో దుకాణాల సంఖ్యను పెంచేశారు. కనిగిరి సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాల గజిట్ 117 ప్రారంభం కానుంది. కనిగిరి టౌన్‌లో 6 కనిగిరి రూరల్ 3,, పామూరు4, పీసీపల్లి2, సీఎస్‌పురం 2, వెలిగండ్ల 2 మండలాల్లో ఉన్నాయి. గతంలో కంటే రూరల్ పరిధిలో రెండు మద్యం మద్యం షాపులో దుకాణాలు ఎక్కువగా ఏర్పాటు కానున్నాయి. కనిగిరి టౌన్, కనిగిరి రూరల్ షాపులకు రూ.65 లక్షలు, మిగతా మండలాల్లోని షాపులకు రూ.55 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో మాదిరి కాకుండా ఆరు కంతుల్లో దుకాణాల ఫీజులు చెల్లించవచ్చని అధికారులు వెల్లడించారు. హెచ్ఎంపాడు మండలంలోని రెండు దుకాణాలు పొదిలి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోకి వెళ్లనున్నాయి.

**ఇష్టానుసారంగా మార్చుకోవచ్చు..**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గాని, 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ పాలనలో గానీ మద్యం దుకాణాలు నిర్దిష్ట ప్రదేశాల్లోనే ఏర్పాటు చేయాలని అబ్కారీ అధికారులు నిర్దేశించేవారు. ఆసక్తి ఉన్న వారు కూడా ఆయా గ్రామాల పేర్లతోనే దరఖాస్తు చేసుకుని, అక్కడే దుకాణం ఏర్పాటు చేసుకునే వారు. కానీ ప్రస్తుత పాలసీలో ఎక్కడ ఏర్పాటు చేయాలన్నది నిర్దిష్టంగా నిర్ధారించ లేదు. దీంతో లాటరీలో షాపును దక్కించుకున్న వారు వారికి నచ్చిన గ్రామంలో, నచ్చిన ప్రాంతంలో దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక వేళ వారు ఏర్పాటు చేసుకున్న చోట వ్యాపారం ఆశించిన స్థాయిలో లేకుంటే అబ్కారీ అధికారుల అనుమతి తీసుకుని వేరే ఊరికి మార్చుకోవచ్చు. ఇలా ఎన్నిసార్లు అయినా ఎక్కడ వ్యాపారం బాగా ఉంటుందనుకుంటే అక్కడకు మార్చుకోవచ్చు. అంటే ఒక రకంగా చెప్పాలంటే మొబైల్ మద్యం దుకాణాలు మాదిరి అనుకోవచ్చు. తో గ్రామాల్లో కూడా మద్యం కిక్కు ఎక్కడంటే అక్కడ దొరకనుంది.

**మత్తులో పల్లెలు తప్పదా.. ?**

ఇప్పటి వరకు ప్రభుత్వ దుకాణాల ద్వారా ఒక్కొక్కరికి మూడు సీసాలను మాత్రమే విక్రయించే వారు. కానీ ఇక నుంచి ప్రైవేట్‌పరం కావడంతో మందుబాబులకు నిబంధన లేకుండా ఎన్ని సీసాలు కావాలంటే అన్ని విక్రయిస్తారు. దానికి తోడు పర్మిట్ రూంలకు అవకాశం లేకపోవడంతో ఇక కొనుకున్న చోటనో, ఖాళీ ప్రదేశాలు, నిర్మానుష ప్రాంతాలు, ప్రభుత్వ భవనాలు, కళాశాలల ప్రాంగణాలు, ఖాళీ వెంచర్లు ఇలా ఒకటేమి అన్ని ప్రాంతాల్లో మందుబాబులు బహిరంగంగా మద్యం సేవిస్తూ వారి అడ్డాగా మార్చుకునే అవకాశాలు అధికం. ఇది మహిళలకు ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతుంది.

**ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు:**



లాటరీలో షాపు దక్కించుకున్న వారు పాఠశాలలకు, దేవాలయాలకు, జాతీయ రహదారులకు వంద మీటర్ల పరిధిలో కాకుండా సంబంధిత మండల పరిధిలో ఎక్కడైనా దుకాణం ఏర్పాటు చేసుకోవచ్చు. ఏర్పాటు చేసుకున్న తర్వాత ఒక వేళ అక్కడ వ్యాపారం బాగా లేదనుకుంటే అధికారుల అనుమతితో, లైసెన్సీకి ఇష్టం వచ్చిన ఇంకొక ప్రాంతానికి దుకాణాన్ని మార్చుకోవచ్చు. ఒక దుకాణానికి ఎంత మంది ఎన్ని దరఖాస్తులు అయినా చేసుకోవచ్చు. 9వ తేదీ వరకు దరఖాస్తు సాయంత్రం వరకు స్వీకరిస్తాం. 11వ తేదీ ఒంగోలులోని ఏపీ ఎన్జీవో భవన్‌లో లాటరీ తీస్తాం.

– ఆర్ విజయభాస్కర్‌రావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, కనిగిరి

# అన్నపూర్ణాదేవి నమోస్తుతే..



పెదయిర్లపాడులో గాయత్రిదేవి అలంకరణలో



భైరవకోనలో అన్నపూర్ణాదేవి అలంకరణలో త్రిముఖదుర్గాదేవి



నందనమారెళ్లలోని గుడిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



మర్రిపూడిలో అన్నపూర్ణాదేవీ అలంకరణలో అమ్మవారు

కనిగిరి రూరల్: దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని పట్టణంతో పాటు, మండలంలోని వివిధ ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో కొలువు తీరిన అమ్మవారు వివిధ రూపాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి విశిష్ట పూజలు అందుకున్నారు. కనక దుర్గమ్మ గుడి, అంకాళమ్మ గుడి, మద్విరాట్ వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం, దొంతులమ్మ గుడి, సాయిబాబ గుడిలో, దేవాంగ నగర్‌లోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాల్లో ఆయా కమిటీల ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక గార్లపేట రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు, కళ్యాణోత్సవాలు జరిగాయి. అనంతరం అన్నదానం చేశారు. మండంలోని నందన మారెళ్ల బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో చండీహోమం, రుద్రాభిషేకాలు, విశిష్ట పూజలు చేశారు. వేద పండితులు పెనుబాకుల రామ కృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా భైరవకోనలో మూడవరోజు శ్రీత్రిముఖ దుర్గాదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సీఎస్‌పురంలోని కామాక్షీసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కామాక్షీ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో, రాచూరి పెద్దమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పీసీపల్లి: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా పెదయిర్లపాడు మల్లేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గాయత్రిదేవికి అష్టోత్తర పూజ, లలిత సహస్రనామార్చన, కుంకుమార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పామూరు: దసరా శరన్నవరాత్రులలో భాగంగా 3వ రోజు పామూరులో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చకులు తులసీనాథ్, సుమంత్‌శర్మ వేదమంత్రాల నడుమ వాసవీమాత మూలవిగ్రహమూర్తికి, ఉత్సవమూర్తికి విశేష పూజలు చేశారు. మహాలక్ష్మి అమ్మవారు గజలక్ష్మీదేవిగా, వల్లీ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మర్రిపూడి: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శివాలయంలోని అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గంగ్రకోట రామ్మూర్తి, సుధాకరరావు కుమారులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

టంగుటూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వల్లూరమ్మ తల్లి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు ప్రత్యేకంగా నిర్వహించారు. విశేష అలంకరణలు, విద్యుత్ దీపాలంకరణ చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రికి అమ్మవారి ఉత్సవం కనులపండువగా సాగింది. ఆలయ ఈఓ రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సీఎస్‌పురం: అన్నపూర్ణాదేవిగా రాచూరి పెద్దమ్మ



గజలక్ష్మిగా.. మహాలక్ష్మి అమ్మవారు



లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో చండీ హోమం

## కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

పామూరు: మోటార్‌సైక్లిస్టును కారు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్సై టి.కిషోర్‌బాబు వివరాల ప్రకారం..మండలంలోని బొట్లగూడూరుకు చెందిన కోనేటి కృష్ణయ్య కనిగిరి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం డ్యూటీకి వెళ్లేందుకు కృష్ణయ్య బైక్‌పై బొట్లగూడూరు నుంచి పామూరు వస్తుండగా మండలంలోని లక్ష్మీనరసాపురం వద్ద పామూరు నుంచి కందుకూరు వైపునకు పోతున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఘటనలో కృష్ణయ్యకు గాయాలు కాగా వైద్యం నిమిత్తం ఒంగోలు తరలించారు. క్షతగాత్రుడు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## యువతి అదృశ్యంపై కేసు నమోదు

పామూరు: యువతి అదృశ్యంపై ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే... ఏలూరు పట్టణంలోని ఫైర్ ఆఫీస్ ప్రాంతంలో నివాసం ఉంటున్న 26 ఏళ్ల యువతి గత 11 నెలలుగా పామూరులోని ఓ చర్చిలో సేవకురాలిగా పనిచేస్తోంది. సదరు యువతి ఈనెల 3వ తేదీ నుంచి కనిపించడం లేదని, బంధువుల ఇళ్ల వద్ద విచారించినా ఆచూకీ లేదని ఆమె తల్లి శనివారం స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు.

## అమ్మవారికి మంగళసూత్రం అందజేత



అమ్మవారికి మంగళసూత్రం అందజేస్తున్న అంకులయ్య కుటుంబ సభ్యులు

కొండపి (సింగరాయకొండ): కొండపికి చెందిన కళ్లగుంట అంకులయ్య విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గ అమ్మవారికి రూ.16.50 లక్షల మంగళసూత్రాలను అందజేశారు. శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారికి మంగళసత్రాలు చేయిస్తానని మొక్కుబడి చేసుకున్నానని, అందుకే 203 గ్రాముల బంగారంతో చేయించి ఇచ్చానని తెలిపారు. కల్లగుంట రమణయ్య, ఆంజనేయులు, సీనయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## చెప్పింది..చేయాల్సిందే..!

- ఏపీడీ వెంకటస్వామి అత్యుత్సాహం

టంగుటూరు: ఉపాధి హామీ పథకం ఏపీడీ వెంకటస్వామి తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే తొలగించాలని చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదని మండల అధికారులపై ఏపీడీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంది. ఆ ఆడియోలో ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే తొలగించాలని, టీడీపీ అధిష్టానం ఇచ్చిన జాబితా వారినే నియమించాలని, వారి నియామకంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పాడు. అలాగే ఇటీవల ఎన్ఆర్‌ఈజీఎస్ పథకం కింద మంజూరైన రోడ్లు, కాలువలు టీడీపీ అధినాయకులు ఇచ్చిన జాబితా వారికే కేటాయించాలని, ఇందుకు ఏపీఓలు, టీఏలు, ఈసీలు సమావేశంకావాలని హుకుం జారీ చేశారు. టీడీపీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఏపీడీ ఆదేశాలు జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జోన్–5 ఇన్‌చార్జి బొట్ల రామారావు మాట్లాడుతూ ఎన్ఆర్‌ఈజీఎస్ క్షేత్రస్థాయి సిబ్బందిపై టీడీపీ నాయకులు చెప్పిన వారినే నియమించాలని ఏపీడీ ఆదేశాలు జారీ చేసేం హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఫీల్డ్ అసిసెంట్లతో బలవంతంగా రాజీనామా చేయించాలని చేస్తే ఊరుకోమని స్పష్టం చేశారు.

# అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

- పీడీ జోసఫ్‌కుమార్



సామాజిక తనిఖీ రికార్డులు పరిశీలిస్తున్న పీడీ జోసఫ్‌కుమార్

పీసీపల్లి: ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పీడీ జి.జోసఫ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలో 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు చేపట్టిన పనులపై శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మొత్తం రూ.12.26 కోట్ల మేర పనులు చేసినట్లు గుర్తించారు. ప్రజావేదికను సామాజిక తనిఖీ బృందాల నివేదికను చూసి పీడీ నివ్వెరపోయారు. ప్రతి పంచాయతీలో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. మండల పరిధిలోని తనకొండపల్లిలో మొక్కలు లేకుండా నిధులు డ్రా చేసినట్లు గుర్తించారు. వేపగుంపల్లిలో జామ మొక్కలు వేయకుండా రూ.25 వేలు డ్రా చేశారు. గుంటుపల్లిలో పని చేసిన కూలీల వేలిముద్రలు, సంతకాలు లేకుండా నిధులు డ్రా చేశారు. వెంగాయపల్లిలో సంతకాలు లేకుండా నిధులు డ్రా చేశారు. కొలతల్లో కూడా వ్యత్యాసాలు ఉన్నట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. అలవలపాడులో కూడా సంతకాలు లేకుండా వేలిముద్రలు వేయకుండా నిధులు కూలీలకు చెల్లించినట్లు నమోదు చేశారు. ఆశావర్కర్ 16 రోజుల పని కల్పించినట్లు పేర్కొన్నారు. ముద్దపాడులో ఫీల్డ్ అసిస్టెంట్‌కు కూడా హాజరు వేసి రూ.3,500 డ్రా చేసినట్లు సామాజిక బృందం గుర్తించారు. ప్రతి గ్రామ పంచాయతీలో వలంటీర్లకు కూడా హాజరు వేసి నిధులు డ్రా చేసినట్లు గుర్తించారు. చనిపోయిన తరువాత ఓ వ్యక్తికి 10 రోజుల హాజరు వేసి నిధులు డ్రా చేసినట్లు గుదేవారిపాలెంలో గుర్తించారు. మారెళ్లలో ఒకరికి బదులు మరొకరు పనికి వెళ్లి నిధులు డ్రా చేసినట్లు సామాజిక తనిఖీలో గుర్తించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ అవకతవకలకు పాల్పడితే పని రూపాయి రికవరీ చేసి కఠిన చర్యలు తప్పవని తీవ్రంగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ డి.రాజారావు, విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి, ఎస్టీఎం భాస్కర్, ఎస్ఆర్పీ మూర్తి, ఏపీఓ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ వాక్యవతి

సీఎస్‌పురం(పామూరు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభ పంచాయతీ కార్యదర్శి గైర్హాజరుతో వాయిదాపడింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులు గుర్తించేందుకు, పనులు వివరాలు తెలిపేందుకు మండలంలోని కోవిలంపాడులో ఏపీఓ వాక్యవతి ఆధ్వర్యంలో సభ ప్రారంభించారు. కాగా పంచాయతీ పరిధిలోని కొందరు గ్రామసభకు పంచాయతీ కార్యదర్శి మహేష్ రాలేదని గ్రామంలో చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని పీఎస్ పనులు చేయకుండా, విధులకు రాకుండా ఇబ్బందులు పెడుతున్నాడని పీఎస్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామానికి చెందిన ఒకరు భర్త చనిపోయి 7 నెలలు అవుతుంటే నేటికి ఆమె భర్త మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదని ఎన్నోసార్లు కార్యాలయం చుట్టూ తిప్పుకుని ఇబ్బందులు పెడుతున్నారన్నారన్నారు. పంచాయతీ కార్యదర్శి బదిలీ అయ్యారని సమస్యలు పరిష్కరించే వరకు ఆయన బదిలీ నిలిపివేయాలని సభలో వారు కోరారు. సభను వాయిదా వేయాలని గ్రామస్తులు కోరడంతో ఏపీఓ వాక్యవతి సభను వాయిదా వేశారు. దీనిపై పీఎస్‌ను వివరణ కోరగా తాను శనివారం సెలవు పెట్టానని, మరణ ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు 7 నెలలుగా ఓటీపీ రావడం లేదని చెప్పడం గమనార్హం. సమావేశంలో వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ నాయకులు షేక్.ఖాదర్‌బీబుజ్జి, గోను చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నన్నసాని యయాద్రి, నారాయణస్వామి, అంకయ్య పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బెల్లం నిర్మల

జరుగుమల్లి(సింగరాయకొండ): నాలుగు నెలలుగా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు పంచాయతీరాజ్ శాఖ ఏఈ బిల్లులు ఇవ్వడం లేదని పైడిపాడు సర్పంచ్ నాగినేని భాస్కర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లం నిర్మల అధ్యక్షతన శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రభుత్వ పథకాలు వివరించారు. గోకులం షెడ్లను ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు పశు వైద్యాధికారి శ్రావణి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులి భిక్షాలు, ఎంపీడీఓ రమణమూర్తి, వ్యవసాయాధికారియుగంధర్‌రెడ్డి,ఎంపీపీలు, సర్పంచులు పాల్గొన్నారు.

# బీజామృతంతో వరినారు శుద్ధి



వరినారు శుద్ధి చేస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారి వెంకట్రావు

టంగుటూరు: వరి పంట వేసే ముందుగా బీజామృతంతో వరినారు శుద్ధి చేస్తే తెగుళ్లను అరికట్టవచ్చని ప్రకృతి వ్యవసాయాధికారి వెంకట్రావు అన్నారు. మండలంలోని కొణిజేడులో ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో రైతు రాఘవయ్య ఎకరా పొలంలో సాగు చేస్తున్న వరి నారును బీజామృతంతో శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ అధికారి వెంకటరావు మాట్లాడుతూ పంట వేసే ముందుగా బీజామృతంతో నారు శుద్ధి చేసుకోవడం వల్ల భూమి నుంచి సంక్రమించే తెగుళ్లను పూర్తిగా అరికట్టి మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. బీజామృతాన్ని మనం మన ఇంటి ఆవరణలోనే తయారు చేసుకోవచ్చని సూచించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఐసీఆర్పీలు హరిత శృతి, పద్మ, రైతులు హాజరయ్యారు.

## ఈ పంట నమోదు తనిఖీ



పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీ నాయక్

మర్రిపూడి: మండలంలోని అంకేపల్లి, వేమవరం, సన్నమూరు, గుండ్లసముద్రం గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు చేసే ఈ పంట నమోదును ఏడీఓ బాలాజీ నాయక్ శనివారం క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరానికి మండలంలోని రైతులు ఎలాంటి పంటలు సాగుచేసినా తప్పనిసరిగా పంట నమోదు చేయాలన్నారు. ధర్మవరం, తంగెళ్ల, చిమట, కాకర్ల, అయ్యపురాజుపాలెం గ్రామాల్లో పంట నమోదు చేసుకున్న కంది, సజ్జ సాగు చేసిన పొలాలను పరిశీలించారు.

## గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హనుమంతునిపాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు దొంగతనాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కె.మాధవరావు అన్నారు. మండలంలోని లింగంగుంట్ల, రక్షణాపురం గ్రామాల్లో గ్రామస్తులకు అవగాహన కల్పించారు.



రక్షణాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com